క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు నేడు తుది గడువు

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు శనివారం తుది గడువు అని ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్ శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ అధికారులందరూ ఫారం-12 దరఖాస్తులను రిటర్నింగ్ అధికారికి లేదా ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉత్తర్వుల కాపీ, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు.

హవ్వా.. పిల్లలకు కండువాలు వేసి ప్రచారం !


దేవనకొండ చిన్నారులకు జనసేన కండువాలు వేసి ప్రచారం చేస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో టీడీపీ కూటమి నాయకులు ఏమాత్రం ఎన్నికల నియమావళి పాటించడం లేదు. ప్రచారంలో చిన్న పిల్లలకు పార్టీ కండువాలు వేసి వెంట తిప్పుకుంటుండడంతో విమర్శలకు తావిస్తోంది. టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ ఈ నెల 10వ తేదీన దేవనకొండ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో చిన్నారులకు జనసేన పార్టీ కండువాలు కప్పి జై కొట్టించారు. ఎన్నికల నియమావళి ప్రకారం చిన్న పిల్లలకు పార్టీ జెండాలు పట్టించడం, కండువాలు వేయడం, ప్రచారం, ర్యాలీలలో తిప్పడం వంటివి చేయరాదని అధికారులు పదేపదే చెబుతున్నా టీడీపీ కూటమి నాయకులకు ఇవేం పట్టడం లేదు.

పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

తుగ్గలి: మండల పరిధిలోని నల్లగుండ్లలో పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు పెద్దమ్మ విగ్రహం, కలశాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు


సెబ్ పోలీసులకు సూచనలిస్తున్న సెబ్ జోన్-4 డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

ఎమ్మిగనూరురూరల్: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టాలని అనంతపురం సెబ్ జోన్-4 డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సరిహద్దు చెక్‌పోస్టులైన పంచలింగాల, సుంకేసుల, బాపురం, పెద్దహరివాణం, మాధవరం చెక్‌పోస్ట్‌ల నిఘా పెంచాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యాన్ని అరికట్టాలని ఆదేశించారు. నేరచరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేయాలన్నారు. సెబ్ సీఐలు భార్గవ రెడ్డి, రవిచంద్ర, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే అజెండా

దేవనకొండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే తమ అజెండా అని ఆ పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, సీఎం జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. కూటమి అభ్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. నాయకులు లుముంబా, ప్రేమనాథరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కబీర్‌దాసు, అరుణ్‌కుమార్, గఫూర్, చంద్ర, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోంకు బాలుడి తరలింపు

పత్తికొండ రూరల్: పత్తికొండలో పలు చోట్ల బీడీ బంకులు, దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీ చేసిన కేసులో నిందితుడైన బాలుడిని పట్టుకుని నగదు స్వాధీనం చేసుకుని చిల్డ్రన్స్ హోంకు తరలించినట్లు సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. బాలుడు ఒకేరోజు పలుచోట్ల ఒకేరీతిలో దొంగతనానికి పాల్పడడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి అదుపులోకి తీసుకున్నారు. అతడు డోన్‌కు చెందిన బాలుడిగా తెలిసింది. పత్తికొండలోనే గాకుండా డోన్‌లో గంజాయి కేసులో, గుత్తి, పామిడిలో పలు దొంగతనాలకు పాల్పడి మోస్ట్ వాంటెడ్‌గా బాలుడు ఉన్నట్లు సీఐ వివరించారు.

జగనన్న పాలనతోనే రాష్ట్ర ప్రగతి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన ప్రగతి పథంలో సాగిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలు అభ్యున్నతి చెందారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆమె శుక్రవారం ఉదయం పట్టణంలోని 29వ వార్డులో ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, వాటిని పారదర్శకంగా లబ్ధిదారులకు అందించిన విధానాన్ని వివరిస్తూ, మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకునేందుకే ప్రాధాన్యతనిచ్చారేగానీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. సీఎం జగనన్న ఎన్నికల ముందు ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజాభిమానాన్ని పొందారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందిందని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ మహిళల పేరిట సంక్షేమ పథకాలు మంజూరు చేసి పారదర్శకంగా వారి బ్యాంక్ ఖాతాలకే నగదు జమ చేసి సంక్షేమ పాలన సాగించిన వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని ఓటర్లను విన్నవించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

అభ్యర్థించారు. శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు గోకారమ్మ, శివారెడ్డి, రియాజ్‌అహమ్మద్, అబ్రార్, కేశవరెడ్డి, తారా రాజశేఖర్, వీరేష్, సలీం, మహేశ్వర్‌రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు హామీలను నమ్మొద్దు

గోనెగండ్ల: టీడీపీ నాయకులు చెప్పే బూటకపు హామీలను నమ్మవద్దని, ఇచ్చిన హామీలను అమలుచేయడం చంద్రబాబు చరిత్రలోనే లేదని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దమరివీడు, చిన్నమరివీడు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొని ఆమె మాట్లాడారు. నైతిక విలువల్లేని పార్టీలు కూటమిగా వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు ఓటు వేస్తే వెన్నుపోటుదారుడు చంద్రబాబుకు వేసినట్లేనని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను జీర్ణించుకోలేక తోడేళ్ల గుంపు ఒక్కటయ్యాయని విమర్శించారు. పేదల జీవితాల్లో వెలుగులు నిండాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగనన్నకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

చెప్పింది చేయడమే వైఎస్ జగన్ నైజం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నైజమని, నవరత్నాల పథకాలను అర్హులైన పేదలందరికీ అందించి ఆదర్శ పాలన కొనసాగించాని సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చకుండా అవినీతి పాలనకు కేరాఫ్‌గా మారారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు మౌనిక, శిరోమనెమ్మ, నాయకులు శివ నీలకంఠ, వెంకట్రామిరెడ్డి, బందె నవాజ్, మన్సూర్, దొరబాబు, నరసన్న ఆచారి, దస్తగిరి, నాగేష్, లోకేష్, ఈరన్న గౌడ్, చంద్ర, వాసు బసప్ప, భాస్కర్ రెడ్డి, కాశీరెడ్డి, నాయుడు, ఖాజాపటేల్, నాయుడు, మబువలి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరు 29వ వార్డులో మహిళతో ఆప్యాయంగా మాట్లాడుతున్న బుట్టా రేణుక

నేడు విద్యుత్ కోతలు

ఎమ్మిగనూరుటౌన్/తుగ్గలి/గోనెగండ్ల: సబ్‌డివిజన్ పరిధిలో, ఎమ్మిగనూరు పట్టణంలో, తుగ్గలి, గోనెగండ్ల మండలాల్లో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టనున్న కారణంగా శనివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని డీఈ రాఘవేంద్ర, ఏఈలు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్ సురేందర్ రెడ్డి

ఆస్పరి: గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్ సురేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తురువగల్లు, తొగలుగల్లు, యాటకల్లు, బిల్లేకల్లు, వెంగళాయిదొడ్డి గ్రామాల్లో ఆయన పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయించి ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పెద్దయ్య, పెద్దరెడ్డి, లక్ష్మన్న, హనుమంతురెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, ఈరన్న, రంగన్న పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్‌లో మెరిసిన ఆణిముత్యాలు



పూజిత	ఆర్.ప్రత్యూష	ప్రశాంతి	సాయిప్రసన్న
978 ఎంపీసీ	967 ఎంపీసీ	963 బైపీసీ	958 బైపీసీ



బి.శ్రావణి	అమీనా పర్హాద్	కీర్తివాణి	కె.సుజాత
953 బైపీసీ	952 బైపీసీ	951 బైపీసీ	948 బైపీసీ



ఎం.కె.రజనీ	కె.అఖిల	జయలక్ష్మి	అంజలి
946 బైపీసీ	942 బైపీసీ	931 బైపీసీ	926 ఒకేషనల్



మేఘన	బ్రాహ్మణి
479-సీఈసీ	456- సీఈసీ

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో డివిజన్ నుంచి పలువురు విద్యార్థులు సత్తా చాటారు. మొదటి, రెండవ సంవత్సరం పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉంచి ఫలితాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. కొన్నిచోట్ల విద్యార్థులు ఆశించిన మేర ఫలితాలు సాధించలేక చతికిల పడ్డారు. మొత్తం మీద ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందిస్తూ స్వీటు తినిపించారు.

చతికిలపడ్డ చిప్పగిరి విద్యార్థులు

చిప్పగిరి: స్థానిక జూనియర్ కాలేజీ నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, సీఈసీ, బైపీసీ కలిపి 67 మంది పరీక్షలు రాయగా బైపీసీ నుంచి సుస్మిత మాత్రమే పాసైంది. ద్వితీయ సంవత్సరంలో 58 విద్యార్థులు పరీక్షలు రాయగా నలుగురు మాత్రమే ఎంపీసీ నుంచి బలవంతరాయ, హనమంతురావు, సీఈసీ నుంచి సురేఖ, స్పందన ఉత్తీర్ణత సాధించారు. అలాగే మద్దికెర ఆదర్శ పాఠశాలలో ఫస్టియర్‌లో 49 మందికిగాను ఆరుగురు, ద్వితీయ సంవత్సరంలో 60 మంది పరీక్షలు రాయగా ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు.

ఫస్టియర్‌లో సత్తాచాటిన విద్యార్థులు



ఎం.సంధ్య	జి.శ్రావణి	స్వరూపరాణి	ఎమ్.కుమారి
455 ఎంపీసీ	448 ఎంపీసీ	445 ఎంపీసీ	443 ఎంపీసీ



ఫయాజ్	ఆర్.ఆకాంక్ష	జయలక్ష్మి	జి.అంకిత
439 ఎంపీసీ	435 ఎంపీసీ	431 ఎంపీసీ	429 బైపీసీ



ఏ.గీత	కె శాంతిసుధ	పుష్పావతి	నిర్మల
427 బైపీసీ	426 బైపీసీ	423 బైపీసీ	421 బైపీసీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 93 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 47 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మొదటి సంవత్సరంలో 148 మంది పరీక్షలకు హాజరుకాగా 87 మంది ఉత్తీర్ణులైయ్యారు. నారాయణ కళాశాల నుంచి ఎంపీసీలో సమీరా 989, సాయి అనీల్‌కృష్ణ 987, బైపీసీలో రమ్యశ్రీ 975, తులసి 961 మార్కులతో సత్తాచాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో హేమప్రియ 464, బైపీసీలో నిఖితశ్రీ 431 మార్కులు సాధించారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 84 మంది పరీక్షలు రాయగా 32 మంది, ద్వితీయ సంవత్సరంలో 55 మందికిగాను 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాఘవేంద్ర చెప్పారు. సీనియర్ బైపీసీలో ఎంకే.రజనీ 946 మార్కులు సాధించినట్లు తెలిపారు.

నందవరం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 69 మందికిగాను 29 మంది (42 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 55 మందికిగాను 33 మంది (60 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో కే.మానస 446, రెండవ సంవత్సరంలో కే.మల్లేశ్వరి 952 మార్కులతో సత్తా చాటారు.

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 105 మందికిగాను 95 మంది విద్యార్థులు, సెకండియర్‌లో 113 మందికిగాను 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ తెలిపారు. బైపీసీలో ఎం.శ్రావణి అనే విద్యార్థిని 953 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో ఎం.సంధ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బైపీసీలో కె.అఖిల 942 మార్కులతో ప్రతిభ చాటారు.

పత్తికొండ రూరల్: పత్తికొండలోని అంబేడ్కర్ గురుకులం కళాశాలలో ఫస్టియర్ 57 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 46 మంది, సెకండియర్‌లో 67మందికి గాను 45 మంది పాసయ్యారు. బైపీసీ విద్యార్థిని సంధ్యారాణి 939 మార్కులతో సత్తా చాటింది. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో ఫస్టియర్‌లో 56 మందికిగాను 19 మంది సెకండియర్‌లో 84 మందికిగాను 46మంది పాసయ్యారు. కస్తూర్బా విద్యాలయలో ఫస్టియర్‌లో 35 మందికి గాను 24 మంది, సెకండియర్‌లో 28 మందికి గాను 21మంది పాసయ్యారు. పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ 231 మంది పరీక్ష రాయగా 62 మంది, సెకండియర్‌లో 179 మందికిగాను 71 మంది విద్యార్థులు పాసయ్యారు.

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల, కస్తూర్బా విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఫస్టియర్‌లో 238 మంది పరీక్షలు రాయగా 177 మంది (74 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్‌లు సుజాత, చైతన్యస్రవంతి, నిర్మలాకుమారి తెలిపారు. అలాగే సెకండియర్‌లో 192 మందికి గాను 136 మంది పాసైనట్లు (70 శాతం) చెప్పారు. కంబాలపాడు గురుకుల కళాశాల నుంచి సాయిప్రసన్న బైపీసీలో 958 మార్కులతో సత్తా చాటినట్లు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

నందవరం: ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆ పార్టీ నాయకుడు బుట్టా ప్రతుల్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సంజీవపురం గ్రామాల్లో సర్పంచ్ శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలన్నారు. కుట్రల కూటమికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీ నాయకులు శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన మల్లయోధుల మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో వంద కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో యువ నాయకుడు బుట్టా ప్రతుల్ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం కృషి చేయాలని వారికి సూచించారు. నాయకులు మాచాని రఘు, నాగమణి, దస్తగిరి, రాజు, లక్ష్మి నర్సయ్య, సూరి, చిన్న, మధు తదితరులు ఉన్నారు.


బుట్టా ప్రతుల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మల్లయోధుల మాలమహానాడు శ్రేణులు

లక్కందిన్నెలో వ్యక్తి మృతి

దేవనకొండ: మండలంలోని లక్కందిన్నె పీర్లచావిడి వద్ద పెద్ద రంగస్వామి (50) అనే వ్యక్తి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దేవనకొండ సీఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి శుక్రవారం చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడిది అనంతపురం జిల్లా గుత్తి మండలం పూలకుంట గ్రామమని, కొన్నేళ్లుగా లక్కందిన్నె, పి.కోటకొండ, గుమ్మరాళ్ల చుట్టుపక్కల గ్రామాల్లోని గొర్రెల కాపరుల వద్దకు చేరుకుని, వారు పెట్టిన భోజనం తిని పనిచేస్తూ వారు ఇచ్చే డబ్బులతో జీవనం సాగించేవాడన్నారు. ఒంటరిగానే తిరిగేవాడని, మద్యం సేవించే అలవాటు కూడా ఉందన్నారు. ఈనెల 10వ తేదీన లక్కందిన్నె గ్రామ దేవరలో పాల్గొని భోజనం చేసి 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో పీర్లచావిడి వద్ద మృత్యువాత పడినట్లు చెప్పారు. మృతుడి వదిన దుర్గమ్మ, భర్త రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం పెద్ద సంఖ్యలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. 449 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి తెలిపారు. గర్భిణులు కూర్చునేందుకు కూర్చీలు ఏర్పాటు చేశామని, పేర్లు నమోదు చేసుకున్న ప్రతిఒక్కరికీ స్కానింగ్ పరీక్షలు చేసి పంపినట్లు చెప్పారు. డాక్టరు మైత్రేయితో పాటు డాక్టర్లు సుజిత, ఫాతీమ తదితరులు వైద్య సేవలందించారు.

ఉచితంగా వైద్య పరీక్షలు

గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా హస్పిటల్‌లో స్కానింగ్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలుండే ఆహారం తీసుకోవాలన్నారు. రక్త, షుగర్, బ్లడ్ గ్రూప్, సుఖ వ్యాధులు, హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతినెలా తప్పకుండా ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలని చెప్పారు. సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్ బాలాజీకుమార్ తదితరులు ఉన్నారు.


స్కానింగ్ పరీక్షల కోసం వేచిఉన్న గర్భిణులు

వైఎస్సార్‌సీపీతోనే దూదేకులకు గుర్తింపు

ఎమ్మిగనూరుటౌన్: నూర్‌బాషా దూదేకుల వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తగిన గుర్తింపునిచ్చారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ బాజీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పింజరి, దూదేకుల వర్గాలవారిని అవహేళన చేయకుండా చట్టం చేస్తూ సీఎం వైఎస్ జగన్ జీఓ ఇచ్చారన్నారు. విద్యాపరమైన సర్టిఫికెట్ల జారీలో ఇండియన్ హిందూ దూదేకులకు బదులుగా ఇండియన్ ముస్లిం దూదేకులగా మార్చారని తెలిపారు. షేక్ బాజీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా తమ కులస్తులు ఉన్నారని, తమకు ప్రాధాన్యతనిచ్చిన వైఎస్ జగన్‌కు అండగా ఉంటామన్నారు. ఈ నెల 27న ఎమ్మిగనూరులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో నూర్‌బాషా దూదేకుల సమావేశం నిర్వహించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిస్తామన్నారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సురక్ష


హెచ్.కైరవాడిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ప్రవీణ్‌కుమార్

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీఎంహెచ్ఓ ప్రవీణ్‌కుమార్, జిల్లా టీబీ ఆఫీసర్ భాస్కర్ పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చిన ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వైద్యులు అపర్ణ, విష్ణు, విజయ్ 240 మందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్రం, మలేరియా, డెంగ్యూ, దీర్ఘకాలిక వ్యాధులు తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంపీహెచ్ఈఓలు హనుమంతు, కృష్ణ, దేవకుమారి, ఎన్ఎస్ఎంలు, పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంప్ డాక్టర్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 8 మందికి గుండె జబ్బుకు సంబంధించిన పరీక్షల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్లు సుప్రజ, బి.రెడ్డి, ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఎస్ వేణుగోపాల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దుర్తి(కృష్ణగిరి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో శోకసంద్రంలో మునిగిన తల్లిదండ్రులను వైఎస్సార్‌సీపీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి పరామర్శించారు. వివరాలు.. వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరుకు చెందిన కోళ్ల శివప్రసాద్ (22) గురువారం పని నిమిత్తం ప్యాపిలి మండలం ఏనుగుమర్రికి బైక్‌పై వచ్చి హైవే-44పై యూటర్న్ తీసుకుంటుండగా లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ప్యాపిలి ఎస్ఐ శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రామ్మోహన్ రెడ్డి శుక్రవారం డోన్ ఆసుపత్రి మార్చురీకి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. యువకుడి తల్లిదండ్రులు నారాయణ, నాగరత్నమ్మలను ఓదార్చారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

తుగ్గలి: వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. జీ.ఎర్రగుడి సచివాలయ వలంటీర్లు 15 మంది, శభాష్‌పురం సచివాలయ వలంటీర్లు 5 మంది స్వచ్ఛందంగా రాజీనామా చేస్తూ పత్రాలను శుక్రవారం ఎంపీడీఓ విజయలక్ష్మికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా తాము గౌరవ వేతనంతో నిస్వార్థంగా పేద ప్రజలకు సేవలందించామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు సకాలంలో అందించడంపై సంతృప్తిగా ఉందన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేశామని వివరించారు. అలాంటి తమను ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం పలుమార్లు నిందించినా, దేశద్రోహులు, నేరగాళ్లు అని అవమానపరిచినా సేవలు మానలేదని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని మరింత అవమానపరుస్తూ తమ సేవలను అడ్డుకోవడం ఎంతో బాధించిందని, తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

హొళగుంద: మండలంలోని ఆయా సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న 25 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆజాద్‌ను కలిసి రాజీనామా పత్రాలు సమర్పించారు.

సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా


కనకవీడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకవీడు, ఇబ్రహీంపురం గ్రామాల్లో పురవీధుల్లో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జగరబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలపాలు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన గ్రామాల్లో గొడవలకు పాల్పడితే శిక్షర్హులవుతారన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.